# సాక్షి పశ్చిమగోదావరి

గురువారం । 15 । ఆగస్టు । 2024





### స్పిన్‌టెక్‌లో అగ్ని ప్రమాదం

దువ్వ గ్రామ పరిధిలోని గౌతమి స్పిన్‌టెక్ కర్మాగారంలో బుధవారం అగ్ని ప్రమాదం జరిగి సుమారు రూ.10 లక్షల విలువైన కాటన్ బేళ్లు కాలిపోయాయి. IIలో ▸



### పోరాట ఝురి.. గోదావరి

స్వాతంత్ర్య సంగ్రామంలో గోదావరి జిల్లాలకు చెందిన ఎందరో మహానుభావులు వీరోచితంగా పోరాడి తమ ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించారు. IIలో ▸



### ఢిల్లీ స్వాతంత్ర్య వేడుకలకు రైతు

ఢిల్లీలో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల్లో అతిథిగా పాల్గొనేందుకు ఏలూరు జిల్లాకు చెందిన సామాన్య రైతు పొట్టిపోతుల పోతురాజుకు ఆహ్వానం అందింది. IIలో ▸

## న్యూస్‌రీల్

### రాజ్‌భవన్‌లో విందుకు పారిశుద్ధ్య కార్మికుడు



గుమ్మడి స్వామినాయుడు

నరసాపురం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నరసాపురానికి చెందిన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడు గుమ్మడి స్వామినాయుడుకు అదుదైన గుర్తింపు లభించింది. స్వాతంత్ర్య వేడుకలకు ముందు రోజు రాత్రి గవర్నర్ నివాసంలో వివిధ రంగాల్లో ప్రజలకు సేవలందిస్తున్న వారికి విందు ఇచ్చారు. పారిశుద్ధ్య విభాగం నుంచి విజయవాడ రాజ్‌భవన్‌లో బుధవారం రాత్రి గవర్నర్ ఇచ్చే విందులో పాల్గొనే అవకాశం స్వామినాయుడుకు దక్కింది. గవర్నర్ కార్యాలయం ఆహ్వానం మేరకు విందులో పాల్గొనేందుకు స్వామినాయుడు వెళ్లారు. కరోనా సమయంలో విశేష సేవలందించినందుకు స్వామినాయుడుకు ఈ అవకాశం లభించింది. స్వామినాయుడును మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అభినందించారు.

### జెండా వేడుకకు ఏర్పాట్లు సిద్ధం



స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ అంబరీష్

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం కలెక్టరేట్ ఆవరణలోని పరేడ్ గ్రౌండ్స్‌లో గురువారం నిర్వహించే 78వ స్వాతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని భీమవరం ఇన్‌చార్జి ఆర్డీఓ ఎం.అచ్యుత అంబరీష్ చెప్పారు. బుధవారం పేరెడ్ మైదానంలో స్వాతంత్ర వేడుకల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ప్రధాన వేదిక, స్టాల్స్, ప్రభుత్వ శాఖల అభివృద్ధిని తెలిపే శకటాలను ఆయన పరిశీలించారు. ప్రొటోకాల్‌ను అనుసరించి సీటింగ్, స్టేజీ, తాగునీటి సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టం తదితర ఏర్పాట్లు చేశామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు, అంబులెన్స్ సేవలు సిద్ధం చేశామన్నారు. వేడుకలలో ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలపై ఆరా తీశారు. వేడుకలను ఎక్కువ మంది ప్రత్యక్షంగా వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ రావి రాంబాబు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

### హెచ్‌ఐవీపై అవగాహనకు 'మీకోసం' ప్రారంభం

భీమవరం (ప్రకాశం చౌక్): హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై మీకోసం పేరిట జిల్లాలో రెండు నెలల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు డీఎల్‌ఏటీఓ డాక్టర్ భాను నాయక్ చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణలో ఎయిడ్స్ నియంత్రణ నివారణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని బుధవారం భానునాయక్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి కల్యాణి ప్రారంభించారు. భానునాయక్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నివారణ, పరీక్షలు, చికిత్స సేవలను అందించడం ద్వారా భారత ప్రభుత్వం 2030 నాటికి ఎయిడ్స్ ఇతర అంటువ్యాధుల మహమ్మారిని అంతం చేయాలనే లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. డాక్టర్ ఎం.గోవింద్‌బాబు, ఏఆర్‌టీ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

### అత్తిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ



అత్తిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న శ్రీనివాసరావు

అత్తిలి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఫైర్ ఆఫీసర్ బి శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం అత్తిలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యాలయంలో విద్యుత్ వైర్ల పరిస్థితి, ఇన్వర్టర్ బ్యాటరీలను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డు గదిని సందర్శించి సూచనలు చేశారు. విద్యుత్ వైరింగ్‌లో లోపం ఉంటే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించే ప్రమాదం ఉన్నందున అధికారులు ఎప్పటికప్పుడు వైరింగ్ సక్రమంగా ఉండేవిధంగా చూసుకోవాలని సూచించారు. అయితే విద్యుత్ వైరింగ్ సక్రమంగా ఉన్నట్లు గుర్తించి సంతృప్తి వ్యక్తం చేశారు. సబ్ రిజిస్ట్రార్ జి.శివయ్య, సీనియర్ అసిస్టెంట్ పి.రాంబాబు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలోని 50 పడకల ఏరియా ఆస్పత్రి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఈ ఆస్పత్రికి భీమవరం పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు కృష్ణా జిల్లా నుంచి కూడా ప్రజలు వైద్య సేవల కోసం వస్తుంటారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ఆస్పత్రికి పూర్తి స్థాయిలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోగా ప్రస్తుత పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. ఈ ఆస్పత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సాక్షి బృందం (ఈ నెల 12న) సోమవారం చేసిన పరిశీలనపై గ్రౌండ్ రిపోర్ట్.

# వైద్యానికి సుస్తీ



వార్డులో ఏసీలు పనిచేయక ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న బాలింతలు

- ఓపీ విధులకు ఆలస్యంగా వచ్చిన వైద్యులు
- లైన్‌లో గంటల తరబడి నిరీక్షణతో అవస్థలు
- ఉక్కపోతతో వార్డులలో బాలింతలు విలవిల
- కంటి విభాగంలో శ్లాబ్ లీకేజీ సమస్య
- భీమవరం ఏరియా ఆసుపత్రిలో 'సాక్షి' గ్రాండ్ రిపోర్ట్

**భీమవరం (ప్రకాశం చౌక్)/భీమవరం/పాలకోడేరు: భీమవరంలోని ఏరియా ఆసుపత్రిలో సాక్షి బృందం పరిశీలనలో అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయి. ఓపీ విభాగంలో విధులకు వైద్యులు ఆలస్యంగా రావడంతో గంటల తరబడి రోగులు ఎదురుచూడాల్సి వచ్చింది. వైద్యుల కొరత, సౌకర్యాల లేమితో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.** సోమవారం ఉదయం 9.30 గంటలకు విధులకు హాజరు కావాల్సిన గైనకాలజిస్టులు 10 గంటలు దాటినా రాలేదు. దీంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులు అంతసేపు లైన్‌లో నిలబడలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అత్యవసర వైద్యం కోసం వచ్చిన వారు ఎక్కువ సేపు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. అత్యవసర కేసులను జనరల్ విభాగం వైద్యులు చూడటం లేదు.

**ఉక్కపోతలతో విలావిలా..**

ఆస్పత్రిలో బాలింతలకు సంబంధించి రెండు వార్డులు ఉన్నాయి. ఈ వార్డుల్లో మొత్తం నాలుగు ఏసీలు ఉండగా వాటిలో కేవలం ఒక ఏసీ మాత్రమే పనిచేసింది. గాలి కూడా సరిగ్గా రాని విధంగా ఈ వార్డులు ఉండటంతో బాలింతలు ఉక్కపోతకు గురై విలావిలాడటం కనిపించింది. కొందరు ఇంటి నుంచి టేబుల్ ఫ్యాన్లు తెచ్చుకుని ఉపయోగించుకుంటున్నారు. ఇక మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉందని బాలింతలకు సహాయంగా వచ్చినవారు వాపోయారు. శుభ్రంగా ఉండడం లేదని, నీటి సౌకర్యం సక్రమంగా లేదని చెబుతున్నారు.

**సౌకర్యాలు, ఫర్నిచర్ కొరత**

ఆస్పత్రిలో వైద్యులు, రోగులకు సరిపడే ఫర్నిచర్, ఫ్యాన్లు, తదితర సౌకర్యాల కొరత ఉంది. రోగులు వేచి ఉండే ప్రాంతాల్లో ఫ్యాన్లు లేక ఉక్కపాతతో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కూర్చునేందుకు బెంచీలు లేక నిలబడి వైద్య సేవలు పొందుతున్నారు.

**మార్చూరీలో పనిచేయని ఫ్రీజర్లు**

మార్చూరీలో పోస్టుమార్టు కోసం వచ్చే మృతదేహాలను భద్రపరిచే ఫ్రీజర్లకు కాలం చెల్లండంతో అవి పనిచేయడం లేదు. దీంతో కొత్త ఫ్రీజర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.



భీమవరం ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రి

### నిత్యం ఓపీకి 400 మంది రోగులు

ఈ ఆస్పత్రికి రోజుకు 300 నుంచి 400 మంది అవుట్ పేషెంట్ వైద్య సేవల కోసం వస్తున్నారు. ఇన్ పెషేంట్లుగా 50 నుంచి 60 మంది ఉంటారు. నెలకి 60 నుంచి 70 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. ఆస్పత్రిలో వైద్య సేవలు పొందే రోగుల సంఖ్య పెరుగుతుండటంతో ఇక్కడి వైద్యుల పోస్టులు, వైద్య పరీక్షల చేసే సిబ్బంది సంఖ్య మరింత పెంచాల్సిన పరిస్థితి ఉంది. ఇక్కడ ఈసీజీ తీయడానికి టెక్నీషియన్ లేకపొడడంతో ఎక్స్‌రే తీసేవారే ఈసీజీ విధులు నిర్వర్తిస్తున్నారు. వర్షాకాలం కావడంతో వ్యాధుల బారిన పడి ఎక్కువ మంది రోగులు ఆస్పత్రికి వస్తుండటంతో రక్త పరీక్షల సంఖ్య పెరిగింది. ఆ మేరకు పరీక్షలు చేసే సిబ్బంది సంఖ్య తగినంతగా లేక సకాలంలో రిపోర్టులు వెల్లడి కాక రోగులకు వైద్య సేవల్లో జాప్యం జరుగుతోంది. దీంతో కొందరు రోగులు బయట పరీక్ష కేంద్రాలకు వెళ్లి డబ్బులు ఖర్చు పెట్టి పరీక్షలు చేయించుకుంటున్నారు.



సమయానికి డాక్టర్ రాకపోవడంతో ఖాళీగా ఉన్న గైనకాలజీ విభాగం

### లీకేజీ సమస్యతో సతమతం

ఆస్పత్రి పాత భవనం శ్లాబ్ కొన్ని చోట్ల లీకేజీలు ఏర్పడి వర్షం కురిసిన సమయంలో కారిపోతున్నాయి. ఇలా వర్షం నీరు పడి కంటి విభాగంలోని కంప్యూటర్లు పాడై కంటి వెలుగు సేవలు నిలిచిపోయాయి. దీంతో కేవలం కంటి పరీక్షలు మాత్రమే చేస్తున్నారు. రోగుల డేటా కంప్యూటర్‌లో నమోదు చేసే వీలు లేకపోవడంతో కళ్ల జోడులకు సిఫార్సు చేసే పరిస్థితి లేదు.



శ్లాబ్ లీకేజీ వల్ల కంటి విభాగంలో తడిచి పాడైన కంప్యూటర్లు



గైనకాలజీ విభాగం వద్ద వైద్యుల కోసం ఎదురుచూస్తున్న గర్భిణులు



ఓపీ విభాగంలో క్యూలో నిలబడి నిరీక్షిస్తున్న రోగులు

## ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలి

కలెక్టర్ సి. నాగరాణి



కలెక్టరేట్‌లో జాతీయ జెండాతో కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా జిల్లాలో ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం వివిధ శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించేందుకు, జాతీయ జెండా ప్రాముఖ్యతను ప్రజలందరికీ తెలియజేసి వారిలో చైతన్యాన్ని కలిగించేందుకు హర్ ఘర్ తిరంగా ర్యాలీలను నిర్వహించడంలో అధికారులు కీలక భూమిక పోషించాలన్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో స్వాతంత్ర్య సమరయోధులను సత్కరించుకోవాలన్నారు. వేడుకల్లో దేశభక్తి భావాలను పొంపెందించే రీతిలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జాతీయ జెండాతో ఫొటో, వీడియో సెల్ఫీలను గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. భీమవరం కలెక్టరేట్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో గురువారం ఉదయం 9 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని, వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విచ్చేసి పతాకావిష్కరణ చేస్తారని తెలిపారు. వేడుకలకు ప్రజలందరూ హాజరై విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

## సాంఘిక అణచివేతపై ఉద్యమించాలి

కేవీపీఎస్ శిక్షణ తరగతుల ముగింపు సభలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు





భీమవరం కేవీపీఎస్ శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

భీమవరం: సాంఘిక అణచివేత, అసమానతలపై మరింత ఉద్యమించాలని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర శిక్షణ తరగతులు ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78వ స్వాతంత్ర్య వేడుకలు జరుపుకుంటున్నా దళితుల బతుకులు మారకపోవడం బాధాకరమన్నారు. అంటరానితనం భౌతికంగా తగ్గినా మానసికంగా కొనసాగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కీలకమైన విద్య, వైద్య రంగాల్లో కూడా నేటికీ కుల వివక్ష కొనసాగడం బాధాకరమన్నారు. కులనిర్మూలన కోసం ధైర్యం, చైతన్యంతో కృషి చేసే కేవీపీఎస్ కార్యకర్తలను అభినందించాలన్నారు. భవిష్యత్‌లో సమాజంలో వచ్చే అనేక రుగ్మతలకు వ్యతిరేకంగా ప్రజా సమానత్వం కోసం కృషి చేయాలని కేవీపీఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ సమాజంలోని కులవ్యవస్థను పెకిలించాలని పిలుపునిచ్చారు. మతం కంటే మానవత్వం గొప్పదని, దేశాభివృద్ధికి ప్రజలందరూ ఐక్యంగా ఒకే వేదికపై రావాలన్నారు. శిక్షణా తరగతులకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ ఆనంద్‌బాబు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు.

**చిట్టిరాజుకు సత్కారం :** సివిల్స్‌లో ఆలిండియా 833వ ర్యాంకు సాధించిన కొయ్యే చిట్టిరాజును ఎమ్మెల్సీ లక్ష్మణరావు, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దడాల సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షుడు బి.బలరాం సత్కరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బి.రఘురాం, టి.చిరంజీవి, జి.నటరాజు, బాగం లక్ష్మి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయ్‌కుమార్, కె.క్రాంతిబాబు పాల్గొన్నారు.

## మంచినీటి చెరువు ప్రక్షాళన

సాక్షి స్పందన



చెరువులో క్లోరినేషన్ చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: గూట్లపాడులో రక్షిత మంచినీటి చెరువులో నీరు పసర్లు బారిన పడటంతో చెరువును ప్రక్షాళన చేసే దిశగా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. 'పసర్ల బారిన మంచినీటి చెరువు నీరు' శీర్షికతో ఈ నెల 12న సాక్షిలో ప్రచురితమైన కథనంపై పంచాయతీ కార్యదర్శి జీవీ సత్యనారాయణ స్పందించారు. బుధవారం చెరువులో తాగునీటిని క్లోరినేషన్ చేసి గట్టుపై ఉన్న గడ్డి, పిచ్చిమొక్కలను సిబ్బంది తొలగించే చర్యలు చేపట్టారు. విద్యుత్ మోటార్లతో కొత్త నీటిని చెరువులోకి నింపుతున్నారు. రక్షిత మంచినీటి చెరువుపై ప్రక్షాళన పనులు చేపట్టడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### 'గవర్నర్ ఎట్ హోమ్'కు శ్రీనివాసరెడ్డికి ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): స్వాతంత్ర్య దినోత్సవం రోజు వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారి గౌరవార్థం రాజభవన్‌లో రాష్ట్ర గవర్నర్ నిర్వహిస్తున్న 'ఎట్ హోమ్' కార్యక్రమానికి ఏలూరు దత్తాశ్రయం రోడ్డులో ఉన్న పరివర్తన్ ప్రత్యేక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరెడ్డికి గవర్నర్ నుంచి ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి బుధవారం ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## ఏటిగట్ల పటిష్టతకు చర్యలు



గంగడుపాలెంలో ఏటిగట్టును పరిశీలిస్తున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

యలమంచిలి: ఏటిగట్ల పటిష్టతకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, గంగడుపాలెం గ్రామాల్లో బలహీనంగా ఉన్న ఏటిగట్టును బుధవారం ఆమె స్వయంగా పరిశీలించారు. వచ్చే అక్టోబర్, నవంబర్ నెలల్లో అధిక వర్షాల వలన గోదావరికి వరద వస్తే ఈ ప్రాంతాల్లో ఏటిగట్టుకు గండిపడే అవకాశం ఉన్న నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా ఏటిగట్టును పటిష్టం చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ మూడు గ్రామాల పరిధిలో సుమారు 2.5 కిలోమీటర్ల మేర ఏటిగట్టు బలహీనంగా ఉన్నట్లు గుర్తించామని ఇరిగేషన్ ఎస్సీ జి శ్రీనివాస్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వీటి పటిష్టానికి రూ.6.67 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేశామన్నారు. నిధుల విడుదలకు కృషి చేస్తానని, పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఆమె వెంట నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత అంబరీష్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్, డీఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



### స్వాతంత్ర్య స్ఫూర్తి.. భవితకు దీప్తి

పాఠశాలల్లో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. స్వాత్రంత్య స్ఫూర్తిని చాటుతూ తేతలి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు జాతీయ జెండాలతో '78' ఆకృతిలో ఒదిగి ఆకట్టుకున్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ప్రదర్శన చేశారు.

- తణుకు టౌన్

## క్లుప్తంగా

### స్పిన్‌టెక్‌లో అగ్నిప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

**తణుకు:** తణుకు మండలం దువ్వ గ్రామ పరిధిలోని గౌతమీ స్పిన్‌టెక్ కర్మాగారంలో బుధవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గోడౌన్‌లో ఉన్న కాటన్ బేళ్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. అగ్నిమాపక శాఖ అధికారి ఐ.అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.10 లక్షలు మేర ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఈ కర్మాగారానికి ఫైర్ అనుమతులు లేవని అధికారులు చెబుతున్నారు.

### ఆటో తిరగబడి వ్యక్తి మృతి



ఆటో తిరగబడడంతో మృతిచెందిన చందు

**భీమవరం:** ప్రమాదవశాత్తు ఆటో తిరగబడి వ్యక్తి చనిపోయినట్లు భీమవరం టూటౌన్ పోలీసులు చెప్పారు. వీరవాసరం గ్రామానికి చెందిన చింతా చందు(29) భీమవరం పట్టణంలోని చినరంగనిపాలెంలో కుటుంబసభ్యులతో ఉంటూ ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వస్తుండగా దుర్గాపురం వద్ద ప్రమాదవశాత్తు ఆటో తిరగబడి మృతిచెందాడు, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సీఐ జి.కాళీచరణ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### అక్రమ కలప స్వాధీనం



కొయ్యలగూడెం మండలం పొంగుటూరు సమీపంలో స్వాధీనం చేసుకున్న వాహనం

**కొయ్యలగూడెం:** అక్రమంగా కలప తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కన్నాపురం ఫారెస్ట్ రేంజర్ కె.కృష్ణకుమారి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం రాజవరం నుంచి కొయ్యలగూడెంకు బొలెరో వాహనంలో అక్రమంగా కలప తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. పొంగుటూరు సమీపంలో వాహనం అతివేగంగా వెళ్తుండగా గుర్తించి అనుమానంతో ఆపి డ్రైవర్‌ను ప్రశ్నించగా పొంతనలేని సమాధానం చెప్పాడని.. దీంతో ట్రక్కుపై కప్పి ఉంచిన కవర్ తొలగించగా అక్రమ కలప బయటపడిందన్నారు.

# పోరాట ఝరి.. గోదావరి

- బ్రిటిష్ పాలకులపై గర్జించిన అలనాటి యోధులు
- ఉమ్మడి పశ్చిమలో ఉవ్వెత్తున స్వాతంత్ర్యోద్యమం

**కైకలూరు/తాడేపల్లిగూడెం:** బ్రిటీష్ దాస్య శృంఖలాల నుంచి దేశాన్ని విముక్తి చేయడానికి ఎందరో వీరులు తమ ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పించారు. అలాంటి వారిలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన ఎందరో మహానుభావులు స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటిష్ ఫిరంగులకు రొమ్ము ఎదురొడ్డి ఆంధ్రుల సత్తా చాటారు. మహనీయుల పిలుపులకు ఎందరో ప్రేరణ పొంది.. తుపాకీలు గురిపెట్టినా, లాఠీలు ఎక్కుపెట్టినా వెరవకుండా పోరాటం చేశారు. తెగువను ప్రదర్శించడంలో మగువలు వీర ఝాన్సీలయ్యారు.



తిరుగుబాటు చేసిన వీరులను ఉరి తీసిన పాత పోలవరం దివానం భవనం



పాత పోలవరంలో బ్రిటీష్ వారు స్వాధీనం చేసుకున్న రెడ్డిరాజుల భవనం

### పోరాట యోధులు కృష్ణమూర్తి, అంజిలక్ష్మి



పసల కృష్ణమూర్తి



పసల అంజిలక్ష్మీ

పోరాట యోధులంటే ఇలా ఉండాలని గుర్తింపు పొందారు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పసల కృష్ణమూర్తి, అంజిలక్ష్మి దంపతులు. తాడేపల్లిగూడెం సమీపంలోని పడమర విప్పర్రులో 1900లో కృష్ణమూర్తి, తణుకు సమీప కుమరపల్లిలో 1904న అంజిలక్ష్మి జన్మించారు. 1916లో వీరికి వివాహం జరిగింది. ఇద్దరు ఆడ, ఒక మగ సంతానం. 1929 ఏప్రిల్ 25న చాగల్లు వచ్చిన గాంధీజీకి ఒంటిపైనున్న బంగారపు ఆభరణాలన్నీ ఇచ్చేశారు. కృష్ణమూర్తి జీవితాంతం బాపూజీ వేషధారణలో నడిచారు. విదేశీ వస్త్రాల బహిష్కరణ, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు 1931లో వారిని జైలుకు పంపారు. చంకలో నాలుగేళ్ళ కుమారుడితో అంజిలక్ష్మి జైలుకు వెళ్లారు. 1932 జూన్ 27న భీమవరంలో జరిగిన శాసనోల్లంఘనలో కృష్ణమూర్తి జాతీయ జెండాను కార్యాలయంపై ఎగురవేశారు. బ్రిటీష్ పాలకులు అడ్డుకోడానికి వస్తే అంజిలక్ష్మి అడ్డుగా నిలిచారు. ఈ ఉద్యమాన్ని దక్షిణాది బార్డోలిగా పిలుస్తారు. బ్రిటీష్ ప్రభుత్వం 1932 అక్టోబరు 29న 10 నెలల జైలు శిక్ష విధిస్తూ నెల్లూరు జైలుకు అంజిలక్ష్మిని పంపారు. జైలులో పండంటి ఆడబిడ్డకు ఆమె జన్మనిచ్చింది. ఆమెకు కృష్ణ భారతి అని పేరుపెట్టారు. అనంతరం దంపతులిద్దరూ 60 ఎకరాల పొలాన్ని సమాజహితం కోసం ఖర్చు చేశారు. సొంత ఇంటినే ధర్మాసుపత్రిగా మార్చారు. వితంతు వివాహాలు, అంటరానితనం నిర్మూలన, దళితులకు చదువులు చెప్పించారు. అంజిలక్ష్మీ రాష్ట్రపతి నుంచి అత్యున్నత తామ్ర పత్రం అందుకున్నారు. ఇటీవల అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణకు భీమవరం వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ అంజిలక్ష్మీ కూతురు కృష్ణ భారతి(90) పాదాలకు నమస్కరించారు.

## బ్రిటిష్ వారిపై గిరిజనుల పోరు

**బుట్టాయగూడెం:** స్వాతంత్ర్యోద్యమంలో ఎందరో గిరిజనులు బ్రిటిష్ వారిపై పోరాడారు. 1857లో యావత్ భారతదేశంలో స్వాతంత్ర్య సమరం ప్రారంభమైనప్పుడు దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో బ్రిటిష్ వారిపై తిరుగుబాట్లు జరిగాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం మండలం కొరుటూరుకు చెందిన కొండరెడ్డి గిరిజన తెగకు చెందిన కారుకొండ సుబ్బారెడ్డి పోలవరం పరిసరాల ప్రాంతంతో పాటు బుట్టాయగూడెం నుంచి యర్నగూడెం వరకూ ఉన్న గిరిజన గ్రామాలకు జమిందారుగా ఉండేవాడు. సుబ్బారెడ్డికి బ్రిటిష్ వారంటే ద్వేషం. యర్నగూడెంలో ఆంగ్లేయులపై తిరుగుబాటు చేశాడు. ఆ సమయంలో గోదావరి దిగువ ప్రాంతంలో ఉన్న సుమారు 40 గ్రామాలతో బ్రిటిష్ వారిపై దండయాత్ర చేసి విజయం సాధించారు. సుబ్బారెడ్డికి ముఖ్య అనుచరుడిగా కుర్ల సీతారామయ్య ఉండేవారు. గురుగుంట్ల కొమ్మురెడ్డి, అప్పటి తూర్పుగోదావరి జిల్లా కొండమొదలు గ్రామానికి చెందిన కుర్ల వెంకటరెడ్డిలు కలిసి తెల్లదొరలపై వీరోచిత పోరాటం చేశారు. ఆ సమయంలో సుబ్బారెడ్డి తలకు బ్రిటిష్ వారు రూ. 2,500 వెల కట్టారు. చివరకు కొందరు గిరిజనులు అతనిని వెన్నుపోటు పొడిచి కారుకొండ సుబ్బారెడ్డితోపాటు అతని అనుచరులను మరికొంత మంది విప్లవ వీరులను 1858 జూన్ 11న బ్రిటిష్ వారికి పట్టించారు. పోలవరం మండలం కొరుటూరు, తూర్పుగోదావరి జిల్లా కొండమొదలు తదితర గ్రామాల్లో ఉన్న కారుకొండ సుబ్బారెడ్డి, కుర్లా సీతారామయ్య, కుర్లా వెంకట సుబ్బారెడ్డి, గురుగుంట్ల కొమ్మురెడ్డిలతో పాటు మరి కొంతమంది వీరుల్ని బ్రిటిష్ వారు పట్టుకుని 3 నెలల పాటు విచారించారు. విచారణ అనంతరం 8 మందిని అండమాన్ జైలుకు పంపారు. 35 మంది గిరిజన వీరుల్ని గుంటూరు దగ్గరున్న జైలులో బంధించారు. కారుకొండ సుబ్బారెడ్డి, కుర్లా సీతారామయ్యలను బుట్టాయగూడెంలో ఉరి తీశారు. మిగిలిన ఆరుగురిని పోలవరం సమీపంలో ఉన్న దివానం వద్ద ఉరి తీశారు. కారుకొండ సుబ్బారెడ్డి మృతదేహాన్ని చిన్న బోనులో పెట్టి రాజమండ్రి దగ్గర ఉన్న కోటగుమ్మం వద్ద ప్రజలు చూసేలా వేలాడదీశారు. స్వాతంత్ర్యం రావడానికి కొన్నేళ్ల ముందు వరకూ మృతదేహం వేలాడుతూ ఉండేదని పాతతరం వారు చెబుతారు.



కైకలూరులో సమరయోధుల స్మారక స్థూపం



పసల అంజిలక్ష్మీ కుమార్తె కృష్ణ భారతి(90) కాళ్లకు మొక్కుతున్న ప్రధాని మోదీ(ఫైల్)



తణుకులో యర్రమిల్లి రామనాథం భవనం

### నందనం తోటలో గాంధీజీ బస



గాంధీజీ బస చేసిన నందనంతోటలోని ప్రాంతం

**నూజివీడు:** మహాత్మాగాంధీ 1930 ప్రాంతంలో నూజివీడు సందర్శించారు. గాంధీ నేతృత్వంలో జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో నూజివీడు వాసులు తమ వంతు పాత్ర పోషించారు. గాంధీజీ నూజివీడు వచ్చిన సమయంలో గాంధీనగర్‌లో ఉన్న నందనం తోట ప్రాంతంలో ఆయనకు బస ఏర్పాటు చేశారు. విక్టోరియా పురమందిరం వద్ద గాంధీజీ సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి జనం తరలివచ్చారు. బాపూజీ పిలుపుమేరకు జమిందారు ఎమ్మార్ అప్పారావు ఖద్దరు వస్త్రాలు ధరించారు.

### డూ ఆర్ డై ఉద్యమం

భీమవరం పట్టణంలో క్విట్ ఇండియా ఉద్యమంలో బ్రిటిష్ ముష్కరుల కాల్పుల్లో నలుగురు స్వాతంత్ర్య సమరయోధులు మృతి చెందారు. వీరిలో 9 సంవత్సరాల బాలుడు ఉన్నాడు. వేగేశ్న నారాయణరాజు, గొట్టుముక్కల బలరామరాజు, ఉద్దరాజు వెంకటరాజు, ముంత బ్రహ్మం(బాలుడు) 1942 ఆగస్టు 17న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జాతీయ జెండా ఎగురవేసేందుకు వెళ్తుండగా.. బ్రిటీష్ సైనికులు జరిపిన కాల్పులలో అసువులు బాసారు.

### సమరయోధుల నిలయంగా తణుకు పట్టణం

తణుకు పట్టణం సమరయోధులకు నిలయంగా ఉండేది. కర్మయోగి బిరుదు పొందిన యర్రమిల్లి రామనాథం స్వాతంత్ర్య సమరయోధులకు ఉచిత భోజనం అందించాలనే ఉద్దేశ్యంతో తణుకులో ప్రత్యేక భవనం నిర్మించారు. గాంధీజీ తణుకు వచ్చినప్పుడు ఆ భవనంలో ఉండమని గాంధీజీని కోరారు. కైకలూరుకు కూడా ఉద్యమానికి కేంద్రంగా ఉండేది. ఆందోళన చేసిన వారిని అరెస్టు చేసి కైకలూరు జైలుకు తరలించేవారు. అక్కడ అనేక స్మారక కట్టడాలు నేటికి చెక్కు చెదరకుండా ఉన్నాయి.

### 19 ఏళ్ల వయసులోనే జైలుకు



ఏలూరు జిల్లా పెదపాడులో 1911లో గారపాటి సత్యనారాయణ జన్మించారు. కేవలం 19 ఏళ్ల వయసులో బ్రిటీష్ పాలకులను ఎదిరించి 1930లో జైలు జీవితం గడిపారు. సర్దార్ భగత్‌సింగ్, కన్నెగంటి హనుమంతరావు, అల్లూరి సీతారామరాజు, నీలం సంజీవరెడ్డి, ఆర్.వెంకట్రామన్‌కు సన్నిహితులు. మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్‌ను ఏలూరు తీసుకువచ్చారు. తర్వాత 1951లో ఏలూరు నియోజకవర్గానికి మొదటి శాసనసభ్యుడిగా పనిచేశారు. గారపాటి 2002లో మృతి చెందారు.

### 'క్విట్ ఇండియా'లో చురుగ్గా



మండవల్లి మండలం కాకతీయనగర్‌కు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు వుప్పాల కోదండరామయ్య, 1915లో జన్మించారు. ఆయనకు ఏడుగురు మగ, ముగ్గురు ఆడ సంతానం. ఆచార్య ఎన్‌జీ రంగాకు ప్రియశిష్యుడు. గాంధీజీ పిలుపు మేరకు క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలు నిండిపోవడంతో తెనాలి తీసుకొచ్చి కోదండరామయ్యను బంధించారు. ఆయన 2017లో మరణించారు.

### చిచ్చర పిడుగు సీర్ల బ్రహ్మయ్య



సీర్ల బ్రహ్మయ్య బ్రిటీష్ పాలకులకు ముచ్చెమటలు పట్టించారు. ఏలూరులో 1913 జూన్ 10న ఆయన జన్మించారు. హిందీ భాషలో పట్టభద్రుడు. 1930, 1932లో శాసనోల్లంఘన ఉద్యమంలో వలంటీర్‌గా పనిచేశాడు. అలీపూర్ జైలులో 1941లో జైలు శిక్ష అనుభవించాడు. అనంతరం రెండుసార్లు జైలుకెళ్లారు. స్వాతంత్ర్యం అనంతరం ఏలూరు మున్సిపల్ కౌన్సిల్ చైర్మన్‌గా తొమ్మిదేళ్ల పనిచేశారు. ఏలూరులో పలు సాంస్కృతిక సంస్థలను నెలకొల్పారు.

### స్వతంత్ర పోరాటంలో చింతలపాటి



ప్రముఖ గాంధేయవాది చింతలపాటి వర ప్రసాదమూర్తి రాజు చినసింద్రకొలనులో 1919లో జన్మించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. 1961లో అఖిల భారత సర్వోదయ సమ్మేళనం నిర్వహించి, డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఆచార్య వినోబాబావే, జయప్రకాష్ నారాయణను రాష్ట్రానికి తీసుకొచ్చారు. 1971-1972లో రాష్ట్ర మార్కెటింగ్, దేవదాయ శాఖ మంత్రిగా పనిచేశారు.

### చోరీ కేసు నమోదు

**టి.నరసాపురం:** బంగారు ఆభరణాల చోరీపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. మండలంలోని కె.జగ్గవరానికి చెందిన తెలే కృష్ణ ఈ నెల 13న ఇంటికి తాళం వేసి తన భార్యతో కలిసి కూలి పనికి వెళ్ళాడు. తిరిగి మధ్యాహ్నం వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. ఇంటి లోపలికి వెళ్లి చూడగా బీరువాలో దాచిన రెండు బంగారపు ఉంగరాలు, చెవి రింగులు, రూ. 30 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## విద్యా సంస్థల బస్సుల తనిఖీ

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా తిప్పుతున్న వివిధ విద్యా సంస్థల బస్సులను తనిఖీ చేసి వాటిపై కేసులు నమోదు చేసినట్లు ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంత కుమారి తెలిపారు. మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా తమ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్‌గా నిర్వహిస్తున్న తనిఖీల్లో ఇంతవరకూ మొత్తం 63 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ట్యాక్సులు చెల్లించకపోవడం, ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించకపోవడం, పర్మిట్లు లేకుండా బస్సులు తిప్పడం, బీమా చెల్లించకపోవడం, డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్సులు లేకపోవడం, పరిమితికి మించి విద్యార్థులను బస్సుల్లో ఎక్కించడం వంటి వాటిపై కేసులు నమోదు చేసి వాటికి జరిమానా విధించామని తెలిపారు. నమోదు చేసిన 63 కేసులకు సంబంధించి మొత్తం రూ.1,44,600 జరిమానాగా విధించామని తెలిపారు.



విద్యా సంస్థ బస్సు తనిఖీ చేసి కేసు నమోదు చేస్తున్న రవాణ శాఖ అధికారులు

## అంటువ్యాధులపై అప్రమత్తం

**ఏలూరు టౌన్:** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని.. అంటువ్యాధులతో మరణాలు సంభవించకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని డిసీజ్ కంట్రోల్ స్టేట్ అదనపు డైరెక్టర్ డాక్టర్ బీ.సుబ్రహ్మణ్యేశ్వరి చెప్పారు. ఏలూరు శివారు ఆశ్రం వైద్య కళాశాల సుశ్రుత ఆడిటోరియంలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా వైద్య అధికారులు, సహాయ మలేరియా అధికారులతో జిల్లాల్లోని పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల అంటువ్యాధులతో మరణాలు ఆందోళనకరంగా ఉంటున్నాయని, భవిష్యత్తులో మరణాలను నివారించేలా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్, పశ్చిమగోదావరి జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రవికుమార్ ఉన్నారు.



వైద్య అధికారులతో సమీక్షిస్తున్న స్టేట్ అదనపు డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి



### పీఎఫ్ మిస్సింగ్ క్రెడిట్లు సరిచేయాలి



జెడ్పీ సీఈఓను సత్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** జిల్లా పరిషత్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించిన పీఎఫ్ బ్యాలెన్స్ షీట్లలో మిస్సింగ్ క్రెడిట్లను ప్రత్యేక డ్రైవ్ పెట్టి వేగవంతంగా సరిచేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పువ్వుల ఆంజనేయులు, కేవీవీ సుబ్బారావు జిల్లా పరిషత్ సీఈఓ కేవీ సుబ్బారావును కోరారు. 2019 నుంచి ఉపాధ్యాయులకు సంబంధించిన పీఎఫ్ బ్యాలెన్స్ షీట్లను బుధవారం విడుదల చేసిన సందర్భంగా పీఆర్‌టీయూ నాయకులు ఆయనను కలిసి కృతజ్ఞత తెలిపారు. పీఎఫ్ బ్యాలెన్స్ షీట్లలో మిస్సింగ్ క్రెడిట్లను సరి చేయడానికి ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఆన్‌లైన్‌లో అన్ని రకాల వివరాలు తెలుసుకోవడానికి సైట్ సరిగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### పీడీఎస్ రైస్ సీజ్

**కొయ్యలగూడెం:** పీడీఎస్ రైస్ అక్రమ రవాణాకు సంబంధించి వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై జీజే విష్ణువర్ధన్ బుధవారం తెలిపారు. కన్నాపురం గ్రామానికి చెందిన గ్రంధి శ్రీనివాస్ తన గొడౌన్‌లో సుమారు 1.60 లక్షల విలువైన నలభై క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి ఉంచగా సివిల్ సప్లై అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారన్నారు. అప్పటి నుంచి నిందితుడు పరారీలో ఉండగా మధ్యాహ్నం కన్నాపురంలో అతనిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

## స్వాతంత్ర్య వేడుకలకు సామాన్య రైతు

**కొయ్యలగూడెం:** ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం పరింపూడి పంచాయతీకి చెందిన పొట్టి పోతుల పోతురాజు పంద్రాగస్టు ఢిల్లీ ఎర్రకోటలో ప్రధాని చేతులమీదుగా నిర్వహించే జాతీయ పతాక ఆవిష్కరణకు అతిథిగా ఆహ్వానం అందుకున్నారు. ఆదర్శ రైతుగా గుర్తింపు పొందిన ఆయన రాష్ట్రం నుంచి వేడుకలకు ఎంపికైన నలుగురు రైతుల్లో ఒకరు. తన కష్టానికి ప్రతిఫలం లభించిందంటూ పోతురాజు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సేంద్రీయ ఎరువులు వినియోగించి యాంత్రీకరణ సాయంతో అధిక దిగుబడి సాధించడం, బిందు సేద్యంతో పంటలు పండించడం, పర్యావరణహితమైన విధంగా పంటలు సాగు చేస్తున్నందుకు పీఎం కిసాన్ పథకంలో ఆయనను ఈ వేడుకలకు ఎంపిక చేశారు.

**సేంద్రీయ సాగుకు తక్కువ ఖర్చు**

పోతురాజు తనకున్న ఆరు ఎకరాలకు తోడు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని అందులో వరి పండిస్తున్నాన్నారు. కేవలం సేంద్రీయ సాగు పద్ధతిలో (జీవామృతం, ఘనజీవామృతం) ఆవు పేడ, గోమూత్రం, బెల్లం, పుట్టమట్టి, సెనగపిండి కలిపి నిపుణుల సూచనల మేరకు పంటకు ఎరువుగా వాడుతున్నారు. ఈ విధానంలో సాధారణ వ్యవసాయానికి అయ్యే ఖర్చులో సగం పెడితే సరిపోతుందని చెబుతున్నారు. గత ఆరు సంవత్సరాలు ఈ విధానంలో పంట పండిస్తున్నారు. సాధారణ వ్యవసాయానికి ఎకరాకు రూ.30 వేలు ఖర్చయితే సేంద్రీయ వ్యవసాయ పద్ధతిలో కేవలం రూ.20 వేలు మాత్రమే ఖర్చయిందని చెబుతున్నారు పోతురాజు. అయితే సేంద్రీయ విధానంలో దిగుబడి కొంత తక్కువే వస్తుందని అంటున్నఆరు.

ఇప్పుడాయన కూరగాయల పెంపకంపై దృష్టి సారించారు. బీర, దొండ, అరటి పంటలు పండిస్తున్నారు. కుమారుడు ఆర్మీలో పనిచేస్తుండగా, కుమార్తె, అల్లుడు హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డారు. భార్య నాగమణితో కలిసి స్వయంగా వ్యవసాయ క్షేత్రాలలో పనులు చేసుకుంటామని తెలిపారు. తన కృషిలో ప్రధాన పాత్ర వేదభారత్ నేచురల్ ఫుడ్ ప్రొడక్ట్ మేనేజింగ్ డైరెక్టర్ నిడదవోలు వినయ్ కుమార్‌కు దక్కుతుందని చెప్పారు. కొయ్యలగూడెంకు చెందిన వినయ్ కుమార్ దశాబ్దన్నర క్రితం హైదరాబాద్ వెళ్లి వేద భారత్ నెలకొల్పారు. అనంతరం ఆయన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 1500 ఎకరాల విస్తీర్ణంలో సేంద్రీయ సాగు చేస్తున్నారని, దానిని స్ఫూర్తిగా తీసుకొని సొంత పొలంలో వ్యవసాయ విధానాన్ని అవలంభించానని పోతురాజు చెప్పారు.



కొయ్యలగూడెంలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఆదర్శ రైతు పోతురాజు

### ఉచితంగా శిక్షణ ఇస్తా



ఔత్సాహిక రైతులు ముందుకు వస్తే వారికి ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా. మా వ్యవసాయ క్షేత్రాలలో ఉపయోగిస్తున్న సేంద్రీయ వ్యవసాయ సాగు పద్ధతులపై ప్రత్యక్షంగా శిక్షణ ఇస్తాం.

–పొట్టి పోతుల పోతురాజు, నాగమణి దంపతులు

క్లుప్తంగా

### గూడెం ఎస్ఐగా నాగరాజు

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం పట్టణ సబ్ ఇనస్పెక్టర్‌గా పి.నాగరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ ఇటీవల రూరల్ ఎస్ఐగా బదిలీఅయ్యారు. పట్టణంలో శాంతి భద్రతల కృషికి తన వంతు కృషి చేస్తానని కొత్త ఎస్ఐ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.



# హర్ ఘర్ తిరంగా సంబరాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో బుధవారం బీజేపీ, ఏబీవీపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ అభియాన్ యాత్ర నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, బీజేపీ నాయకులు టి.భోగేశ్వరరావు, పసుపులేటి రామారావు, నరిశే సోమేశ్వరరావు, కంచుమర్తి నాగేశ్వరరావు, తుమరాడ చిన్న, దొంతకుర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు: హర్‌ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ముదునూరు గ్రామంలో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. దేశానికి స్వాతంత్ర్యం అందించిన మహనీయులను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాల్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దత్తు ప్రసాద్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



పెంటపాడు: ముదునూరు జెడ్పీ స్కూల్‌లో హర్‌ఘర్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

**సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయం**

తణుకు టౌన్: స్వాతంత్ర్య కోసం త్యాగాలను చేసిన సమరయోధులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎంపీడీవో కిరణ్‌కుమార్ తెలిపారు. తణుకు మండలంలోని వివిధ పాఠశాలలో హర్ ఘర్ తిరంగా యాత్ర కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 100మీటర్ల భారీ జాతీయ జెండాతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ సరెళ్ల క్రాంతి ప్రియ, సరెళ్ల సతీష్, మండల బీజేపీ అధ్యక్షుడు దాసరి వెంకట స్వామి,హెచ్ఎం, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



తణుకు టౌన్ తేతలిలో 100 మీటర్ల జాతీయ జెండాతో గ్రామంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

తణుకు టౌన్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో బీఎంఎస్ ప్రమోదిని కుమారి చెప్పారు. బుధవారం మండలంలోని మండపాక గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగా మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలపై జరిగే లైంగిక దాడుల గురించి, చిన్నారులపై గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మహిళలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

**బాల్య వివాహాలను అడ్డుకోవాలి**

తాడేపల్లిగూడెం రూరల్: బాల్య వివాహాలను అడ్డుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం తాడేపల్లిగూడెం మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో బాల్య వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ బాల్య వివాహాలపై గ్రామస్థాయిలో సీఎంపీవోలు తక్షణమే స్పందించాలని, బాధ్యతగా వ్యవహరించాలన్నారు. తాడేపల్లిగూడెం ఐసీడీఎస్ సీడీపీవో టి.లక్ష్మీ సరస్వతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డి.ఎస్తేరు రాణి, జి.బేబి, కే.శ్రీదేవి, దుర్గాభవాని, కే.వి శాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సందడి



తణుకు అర్బన్: తణుకు ఏకేటీపీ పాఠశాల ప్రాంగణంలో జెండాలు కడుతున్న విద్యార్థులు



పెంటపాడు: పట్టణంలో విక్రయాలకు సిద్ధం చేసిన జాతీయ జెండాలు

తణుకు అర్బన్: భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుక సంబరాలకు తణుకు ముస్తాబైంది. ఎన్నో పోరాటాలు, ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగా ఏర్పడ్డ స్వాతంత్ర్యాన్ని యువత గుర్తుచేసుకుంటూ సంబరాలు చేసుకుంటుంది. 77 సంవత్సరాల భారత స్వాతంత్ర్య దినోత్సవానికి సంబంధించి తణుకులో యువత ద్విచక్ర వాహనాలకు మువ్వన్నెల జెండాలను అమర్చుకుని ప్రయాణాలు చేస్తున్నారు. ముఖ్యంగా బుధవారం పాఠశాలల్లోను, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వ్యాపార సంస్థల్లోను, వాహనాలను మువ్వన్నెల జెండాలతో అలంకరణలు చేపట్టారు. తణుకులో మునిసిపల్, మండల పరిషత్, తహసీల్దార్, వ్యవసాయ శాఖ, ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో గురువారం నిర్వహించే జెండా పండుగకు సర్వం సిద్ధం చేశారు.

**కిటకిటలాడిన దుకాణాలు....**

తణుకు రాష్ట్రపతి రోడ్డు, వేల్పూరు రోడ్డు, సొసైటీ రోడ్డు, ఉండ్రాజవరం రోడ్డులతోపాటు వీధుల్లో వివిధ దుకాణాలు, ఫ్యాన్సీ దుకాణాల్లో మువ్వన్నెల జెండాలతోపాటు చేతికి తగిలించుకునే రిబ్బన్‌లు, జేబుకు పెట్టుకునే బ్యాడ్జ్‌లు, వాహనాలకు ఏర్పాటుచేసుకునేందుకు జెండాలను అమ్మకాలు చే స్తున్నారు. జెండా సామాగ్రి కొనుగోలు చేసేందుకు ఆయా దుకాణాల వద్దకు చిన్నారులు, యువత అధికసంఖ్యలో తరలివచ్చి కొనుగోళ్లకు ఉత్సాహం చూపించారు. దీంతో ఆయా దుకాణాలు కిటకిటలాడాయి.

**సందడే సందడి**

పెంటపాడు: మండలంలో స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని పలు దుకాణాలు సందడిగా మారాయి. విద్యార్థులకు దేశభక్తిపూరిత వేషాలు వేసేందుకు వీలుగా వస్త్ర దుకాణాలలో పలువురి దేశ నాయకుల వస్త్రాలు, జెండాలను పోలిన టీ షర్టులు, యువతుల దుస్తులు, జెండాలు డిస్‌ప్లే పెట్టారు. పలు ఫ్యాన్సీ దుకాణాలలో, రోడ్డుపై బాడ్జిలు, టోపీలు, పూల షాపులలో పూల బొకేలతో పాటు, జెండాలో మూడు రంగులను పోలిన దండలు తయారీ, కొనుగోలు ముమ్మరంగా సాగింది. గూడెం పలు ప్రాంతాలలో ఈ దృశ్యాలు అగుపించాయి.

## చెత్త నుంచి సంపద తయారీకి శ్రద్ధ తీసుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: మండల పరిషత్ సమావేశ మందిరంలో గత మూడు రోజులుగా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఎంపీడీవో విశ్వనాథ్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్ ఆధ్వర్యంలో వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈవో కే.శ్రీనివాసరెడ్డి పంచాయతీ రాజ్ చట్టం గురించి సర్పంచులు, కార్యదర్శులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ముప్పిడి సూర్యకుమారి, ఉండ్రాజవరపు చంద్రిక, పంచాయతీ కార్యదర్శులు రవిచంద్ర, ఫణి, వాణి, శ్రీనివాస్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

**కొనసాగిన శిక్షణ తరగతులు**

తణుకు టౌన్: గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో కే కిరణ్ కుమార్ కోరారు. బుధవారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు నిర్వహించిన ముగింపు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఏఎస్ఆర్ కోటేశ్వరరావు, మండలంలోని గ్రేడ్ 1, గ్రేడ్ 5 గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రెండు గేదెలు అపహరణ.. కేసు నమోదు

తణుకు: తణుకు మండలం వేల్పూరు గ్రామంలోని ఒక డైరీ ఫాంలో గుర్తు తెలియని వ్యక్తులు రెండు గేదెలను అపహరించుకుపోయినట్లు యజమాని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు తణుకు రూరల్ ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు. అత్తిలి మండలం బల్లిపాడు గ్రామానికి చెందిన ఆకుల మారుతి అయ్యన్నరావు వేల్పూరు గ్రామంలో డైరీ ఫాం నడుపుతూ పాలవ్యాపారం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వ్యానుతో డైరీ ఫాంలోకి ప్రవేశించి రెండు గేదెలన అపహరించుకుపోయారు. దీనిపై అయ్యన్నరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## గ్రామాల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలి



ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

ఇరగవరం: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ తెలిపారు. ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులపై అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారుల సూచనల మేరకు సర్పంచ్‌లు పారిశుద్ధ్య పరిస్థితిని మెరుగుపర్చుకోవాలన్నారు. పార్టీలతతీంగా నియోజవర్గ అభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, జెడ్పీటీసీ పంపన అంజిబాబు, మండలంలోని ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీడీవో వి రంగమ్మ రెడ్డి, తహసీల్దార్ ఎం సుందర్ రాజు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.